



లక్ష్యం దిశగా.. రుణమాఫీ

- రూ.2లక్షలకు పైగా రుణాల మాఫీకి మళ్లీ దరఖాస్తులు
- మూడు విడతల్లో పంపిణీ
- ప్రత్యేక ఫార్మాట్‌లో దాఖలు చేయాలని సూచన
- జిల్లాలో ఇప్పటి వరకు 215 మంది రైతుల నుంచి అప్లికేషన్‌లను స్వీకరించిన అధికారులు

నిర్మల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంట రుణమాఫీ ప్రక్రియ లక్ష్యందిశగా సాగుతోంది. ఇప్పటి వరకు మూడుదశల్లో రుణమాఫీని అమలు చేసిన ప్రభుత్వం రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారికి కూడా మాఫీని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారంతా ఆ రుణాల మాఫీ కోసం మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలంటూ కోరుతోంది. దీని కోసం గానూ ప్రత్యేకఫార్మాట్‌ను రూపొందించి అన్ని జిల్లాలకు పంపింది. మొదటి విడతగా లక్ష వరకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం ఆ తరువాత లక్ష యాభై వేల వరకు రెండో విడత కింద మాఫీని అమలు చేసింది. మూడో విడత కింద రెండు లక్షల వరకు రుణమాఫీని వర్తింపజేసింది. నాలుగో విడత కింద ఫ్యామిలీ గ్రూపింగ్ రైతులకు రుణమాఫీని అమలు చేసింది. కాగా ఇప్పటి వరకు రెండు లక్షల వరకు ఉన్న రుణాలన్నింటిని ప్రభుత్వం మాఫీ చేయగా రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు తమకు మాఫీని వర్తింపజేయాలంటూ కోరారు. వీరి అభ్యర్థనను సైతం ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. దీనికి అనుగుణంగా కసరత్తు జరిపి వారి జాబితాను సైతం సేకరించింది. అయితే వీరిలో అర్హులైన వారంతా మాఫీ కోసం దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించింది. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న 215 మంది రైతులు మాఫీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఒక్క రోజే భైంసా మండలం వాలేగాం గ్రామానికి చెందిన 115 మంది రైతులు మాఫీ కోసం దరఖాస్తులు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ప్రక్రియ కూడా కొద్ది రోజుల్లోనే పూర్తి చేసేందుకు వ్యవసాయాధికారులు సీరియస్‌గా చర్యలు చేపడుతున్నారు.

నాలుగు విడతలుగా మాఫీ..

జిల్లాలో నాలుగు విడతలుగా రుణమాఫీ ప్రక్రియను చేపట్టారు. మొదటివిడతలో భాగంగా లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేశారు. జిల్లాలో మొత్తం లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న వారు 29,432 మంది రైతులను గుర్తించి వారందరికి 167.73 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. రెండో విడత కింద లక్ష యాభై వేల రూపాయల వరకు రుణాలు పొందిన పరిగణలోకి తీసుకున్నారు. ఈ లెక్కన 18,729 మంది రైతులకు 196.86 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. అలాగే మూడో విడత కింద రెండు లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న వారికి మాఫీ సౌకర్యం కల్పించారు. దీనికి అనుగుణంగా 16,581 మంది రైతులకు 224.35 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. నాలుగో విడత కింద ఫ్యామిలీ గ్రూపింగ్ పేరిట 6823 మంది రైతులకు రూపాయలు 658.61 కోట్ల రూపాయలను మాఫీ చేశారు.

రెండు లక్షలకు పైగా రుణాలకు సైతం..

మొదట ప్రభుత్వం రెండు లక్షల వరకు వ్యవసాయ రుణాలు తీసుకున్న వారందరికి మాఫీని వర్తింపజేస్తామంటూ ప్రకటించినప్పటికీ ఆ తరువాత రెండు లక్షలకు పైగా ఉన్న వారికి కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేస్తామంటూ ప్రకటించింది. అయితే దీని కోసం గానూ వ్యవసాయ శాఖ రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నిర్ణయించింది. దీని కోసం గాను ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించి అధికారులకు పంపించింది. రెండు లక్షలకు పైగా రుణాలుల తీసుకున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు జిల్లాలో 215 మంది రైతులు ఈ రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

మొదటి నుంచి పకడ్బందీగా..

కాగా జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు రైతు రుణమాఫీని మొదటి నుంచి పకడ్బందీగా చేపట్టారు. నాలుగుదశల్లో అర్హులైన వారందరిని గుర్తించి వారు ఏఏ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారనే వివరాలను సేకరించారు. దీనికి అనుగుణంగా బ్యాంకుల వారీగా రైతుల జాబితాలను రూపొందించి రుణమాఫీ డబ్బులను వారి అకౌంట్‌లలోకి బదిలీ చేశారు. ఆయా బ్యాంకులకు సైతం జాబితాలను పంపి ఆ జాబితాలకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. మొదట లక్ష వరకు రుణాలు తీసుకున్న వారికి ఆ తరువాత లక్ష యాభై వేలు, అనంతరం ఫ్యామిలీ గ్రూప్ చివరకు రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న వారందరికీ మాఫీని వర్తింపజేస్తూ బ్యాంకుల్లో డబ్బులను జమ చేశారు. దీంతో రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తించింది. అయితే రెండు లక్షలకు పై బడి రుణాలు తీసుకున్న వారు సైతం తమను కూడా మాఫీ కోసం పరిగణలోకి తీసుకోవాలంటూ కోరడంతో వారికి సైతం ఈ మాఫీని వర్తింపజేసేందుకు చర్యలు చేపడుతోంది. మొత్తానికి జిల్లాలో రుణమాఫీ లక్ష్యం దాదాపుగా పూర్తయ్యిందంటున్నారు.


రుణమాఫీ కోసం జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఘనంగా శివగణపతి ఆలయ వార్షికోత్సవం


మునిపెల్లిలోని శివగణపతి ఆలయం వద్ద భక్తుల సందడి

లక్ష్మణచాంద, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామంలో గల గోదావరి నది ఒడ్డున గల శివగణపతి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గల శివలింగం, గణపతి విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి నూతన వస్త్రాలను అలంకరించారు. శివ గణపతులతో పాటు ఆలయ ప్రాంగణంలో గల నవగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం దివంగత మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర కూడా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు అయిండ్ల స్వర్ణరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కమల్‌కోట వెంకట్‌రెడ్డి, మేడిపెల్లి గంగాధర్, నూతికాడి రాజారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రాంపెల్లి రమేష్, భీమ్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండాపురం నర్సారెడ్డి, వీడీసీ సభ్యులు, స్థానిక చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పాదుకా దర్శనం


పాదుకా దర్శనం నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని బసవగార్డెన్‌లో బుధవారం స్వస్వరూప్ సంప్రదాయ సేవా సమితి ఆధ్వర్యంలో పాదుకా దర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంత శ్రీ విభూషిత్ జగద్గురు రామానందాచార్య శ్రీ స్వామి నరేంద్రచార్యజీ మహరాజ్, దక్షిణ పీఠం నానిజ్ ధామ్, ముఖ్య ఎఠం నానిజ్ ధామ్, తెలంగాణ ఉప పీఠం స్వస్వరూప్ సాంప్రదాయ నిర్మల్ జిల్లా సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమానికి నిర్మల్ జిల్లా నుండే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జగద్గురు నరేంద్రచార్య మహరాజ్ సిద్ధ పాదుకా దర్శన కార్యక్రమానికి మహిళా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భజన దిండులు, నాయకులు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పేద రైతులకు ఏడు స్ప్రే పంపులను పంపిణీ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. నిర్మల్ జిల్లా సేవా సమితి ఆధ్వర్యంలో గత 30 రోజుల నుంచి జిల్లాలోని గ్రామ గ్రామాన కరపత్రాల ద్వారా పోస్టర్ల ద్వారా ప్లెక్సీల ద్వారా ప్రవచనాల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరి క్షేత్రంలో కావడి మహోత్సవం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం శ్రీగిరి క్షేత్రంలో మంగళవారం కావడి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు మహా హారతి నిర్వహించి అన్నదాన వితరణ చేశారు. గురుస్వామి చిన్నయ్య, మాత రాజరాజేశ్వరి, సముందర్‌పల్లి కిషన్, దినేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై తాజాగా కేసులేవీ పెట్టలేదు

- అసత్య ప్రచారాలు, వదంతులు నమ్మొద్దు : ఎస్పీ



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక ఆందోళన సందర్భంగా రైతులపై కొత్తగా కేసులేవీ నమోదు చేయలేదని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల రైతులపై ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులేనని తాజాగా ఏమీ పెట్టలేదన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో, ఇతర ప్రచార సాధనాల్లో అసత్య, తప్పుడు ప్రచారాలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. వదంతులను ప్రజలు, గ్రామస్థులు నమ్మి ఆందోళనకు గురికావద్దని తెలిపారు. రైతులపై ఆందోళన సమయంలో 307 లాంటి తీవ్రమైన కేసులు పెట్టలేదన్నారు. కొన్ని సంఘ వ్యతిరేకశక్తులు ప్రజల్లో అశాంతి నెలకొలిపే ప్రచారం చేస్తున్నారని అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రేమ పేరిట వంచించాడు.. న్యాయం చేయండి

- ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి మౌన పోరాటం
- ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో ఘటన


ప్రియుడి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న యువతి

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం ప్రేమ పేరిట వెంబడించాడు. తనను పెళ్లి చేసుకుంటానని ఒప్పించి... నాలుగేళ్లుగా ప్రేమాయణం సాగించాడు. తీరా పెళ్లి చేసుకోమంటే చేసుకోనని వంచించాడని ఆరోపిస్తూ ఓ యువతి తన ప్రియుడి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగిన ఘటన ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బాధితురాలు తెలిపిన కథనం ప్రకారం... సుర్జాపూర్ గ్రామానికి చెందిన తనకు మస్కాపూర్‌కు చెందిన నరేందర్ అనే యువకుడికి మధ్య నాలుగేళ్లుగా ప్రేమాయణం సాగుతోందని ఓ యువతి పేర్కొంది. కాగా గత కొద్దిరోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వేరే యువతితో నరేందర్‌కు పెళ్లి సబంధం కుదిరిందని తెలిపింది. దీంతో నరేందర్ తనకు ఫోన్ చేసి ఎలాగైనా ఆ సంబంధాన్ని చెడగొట్టాలని తనకు ఆ అమ్మాయంటే ఇష్టం లేదని తాను నిన్నే పెళ్లి చేసుకుంటానని నరేందర్ నమ్మబలికాడని తెలిపింది. దీంతో నరేందర్ మాటలతో ఆ అమ్మాయి తరుపు బంధువులకు ఫోన్ చేసి నరేందర్‌కు తనకు మధ్య ఉన్న ప్రేమ వ్యవహారాన్ని తెలిపినట్లు పేర్కొంది. తమ ప్రేమ విషయం తెలవడంతో నరేందర్‌కు ఆ అమ్మాయితో వివాహం రద్దయిందని తెలిపింది. తనకు ఇష్టం లేకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి చెడిపోవడంతో ఇక నిన్నే పెళ్లి చేసుకుంటానని తనతో నరేందర్ తెలిపాడని పేర్కొంది. ఇటీవల కొద్దిరోజుల క్రితం వరకు తననే పెళ్లి చేసుకుంటానని చెప్పిన నరేందర్ ఈ మధ్యకాలంలో పెళ్లి మాట ఎత్తడం లేదని తెలిపింది. ఇన్నాళ్లు ప్రేమ పేరిట వంచించి తనను మోసగించేందుకు నరేందర్ ప్రయత్నిస్తున్నాడని గమనించి తనను పెళ్లి చేసుకోవాలని గట్టిగా అడిగినట్లు పేర్కొంది. దీంతో సుర్జాపూర్‌లోని తమ ఇంటికి వచ్చిన నరేందర్ తనపై పెట్రోల్ పోసి చంపేందుకు ప్రయత్నించాడని ఆ యువతి ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటి వరకు గుట్టుగా ఉన్న తమ ప్రేమ వ్యవహారం ఈ ఘటనతో ఇంట్లో తెలిసిపోయిందని పేర్కొంది. తనపై పెట్రోల్ పోసి చంపేందుకు యత్నించే వరకు వ్యవహారం రావడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని పేర్కొంది. ఇక చేసేదేమీ లేక తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని నిర్ణయించుకుని వచ్చి నరేందర్ ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగినట్లు ఆమె పేర్కొంది. నాలుగేళ్లుగా తనను ప్రేమ పేరిట వంచించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసగించిన నరేందర్‌తో తన వివాహం జరిపించేలా చూడాలని ఆమె వేడుకుంటోంది.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం కొండాపూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

గ్రూప్- 2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రూప్- 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్ష ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 24 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. 8080 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. నిర్వహణ కోసం సిబ్బంది నియామకం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నామని పేర్కొన్నారు. బందోబస్తు నడుమ ప్రశ్న పత్రాలు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజులు ఉదయం, మధ్యా హ్నం పరీక్ష సమయమని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. జిరాక్స్ సెంటర్ల మూసివేత, మౌలిక వసతులు తదితర వాటి ఏర్పాట్లపై ఆదేశాలిచ్చారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణి, కోఆర్డినేటర్ పీజీరెడ్డి, డీఈవో రామారావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

ల్యాండ్ రెగ్యులరైజేషన్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. పట్టణ ప్రాంతాల్లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించాలని అవసరమైన వివరాలు సేకరించాలని సూచించారు. నిబంధనల ప్రక్రియ పారదర్శకంగా పూర్తికి ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా కమిషనర్లు పాల్గొన్నారు.


ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ కార్య క్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి డి. శివాజీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్ రెడ్డి, గంగ్రత్ రమేష్, సిరికొండ రమేష్, గాజుల రవి, నరేష్, మజార్, భద్రతా సిబ్బంది, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గుర్తింపు సర్వేకు సహకరించాలి

- భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే నిర్వహించేందుకు వచ్చే వార్డు అధికారులకు పట్టణవాసులందరూ సహకరించాలని భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గాను మొత్తం 12,711 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సోమవారం నుంచి వార్డు అధికారులు సంబంధిత దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వచ్చి లబ్ధిదారులుగా గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు.ప్రతి దరఖాస్తుదారుడి నుంచి 35 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించి నమోదు చేస్తారని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు వార్డు అధికారులకు వాస్తవమైన వివరాలను, ధృవీకరణ పత్రాలను అందించాలన్నారు. సంబంధిత వివరాలన్నీ వారు ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తారని తెలిపారు.

● మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం

వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్ మంగళవారం మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ, కుటుంబ సర్వే దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు తదితర విషయాలపై మున్సిపల్ కమిషనర్ ... ఇన్స్‌పెక్టర్ అనీస్ అహ్మద్‌తో పాటు రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కాలయాపనకు తావులేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని సూచించారు. పన్నుల వసూళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలకు ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అంగవైకల్యం ఉందని ఆందోళన చెందకుండా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ రాణించేందుకు ముందుకు సాగాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ,లయన్స్ క్లబ్ ఆఫ్ భైంసా డైమాండ్, దివ్యాంగుల అసోసియేషన్ భైంసా సంయుక్తంగా నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవం, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.దామోదర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కాశీనాథ్‌లు మాట్లాడుతూ సకాలంగులకు దీటుగా దివ్యాంగులు ప్రతి రంగంలోనూ రాణించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని అకాంక్షించారు. ఇందులో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ అధ్యక్షులు డా.మహిపాల్, కార్యదర్శి సిద్దయ్య, లయన్స్ క్లబ్ జిల్లా క్యాదర్శి మోహన్‌రావ్, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిదులు మహేష్, వెంకటేష్, వీరాజీ. భైంసా డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిదులు డా.రామకృష్ణ గౌడ్, డా.ముత్యం రెడ్డి, ఎల్‌వీపీఈటి కోఆర్డినేటర్ సాయన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్

రేపు అంగన్‌వాడీల చలో హైదరాబాద్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి గాను గురువారం 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. సురేష్ తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏపీడీకి అనుమతి కోసం వినతి పత్రం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బి. లలిత, కోశాధికారి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు


అంబులెన్స్‌లో చికిత్స చేస్తున్న ఈఎంటీ

నర్సాపూర్(జి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి మంగళవారం ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇది గమనించిన వెంటనే 108కి స్థానికులు ఫోన్ చేయడంతో నాలుగు నిమిషాల్లోనే నర్సాపూర్ నుంచి సంఘటన స్థలానికి 108 అంబులెన్స్ సిబ్బంది చేరుకొని తలకు, కాలుకు బలమైన గాయాలైన దేవానంద్(22)ను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిర్మల్ నుంచి ఎడ్‌బిడ్ తండాకు వెళ్తున్న దేవానంద్ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే నర్సాపూర్(జి) ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలట్ సాయి కుమార్, ఈఎంటీ మామిళ్ల ప్రమోద్‌ను మండల వాసులు అభినందించారు.

ల్యాబ్ టెక్నీషియన్ మృతికి సంతాపం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డ వకుళాభరణం భరత్‌కు నిర్మల్ డయాగ్నస్టిక్ అసోసియేషన్ మంగళవారం సంతాపం తెలిపింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇందుకు ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. నేరెళ్ల హన్మంతు, సంతోష్, ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

5వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే దీక్ష

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహారదీక్ష మంగళవారం 5వ రోజు కొనసాగింది. సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనట్టయితే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. పేస్కెల్ వర్తింపు, క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. పీఆర్‌టీయూ నాయకులు మద్దతు తెలిపారు.

చిరుత దాడిలో గొర్రె పిల్ల మృతి

నర్సాపూర్(జి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో గొర్రె మృతి చెందిన సంఘటన కుస్లి గ్రామ శివారు అటవీప్రాంతంలో చోటుచేసుకుంది. మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన మహేష్ అనే గొర్ల కాపరికి చెందిన గొర్రె పిల్ల సోమవారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలోకి మేతకు వెళ్లింది. సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో మంగళవారం గాలించగా చిరుతదాడిలో గొర్రెపిల్ల మృతి చెందినట్లు గుర్తించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాయరెడ్డి, అలేఖ్య అడవిలో పంచనామా చేశారు. గ్రామస్థులు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కుంటాల, డిసెంబరు, 10: (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపెల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం కుంటాల పోలీస్‌స్టేషన్‌లో వెలమ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ నాయకుల తీరు మారడం లేదు

● బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్

తలమడుగు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పినా.. వారికి ఇంకా బుద్ధి మారడం లేదని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉమ్మడం గ్రామంలో ఏడాది ప్రజా పాలన విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆడే గజేందర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అంతేకాకుండా ఎంపీ ఎన్నికల్లో వారికి జీరో సీట్ వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ సంవత్సరపు కాలంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, మల్లెపూల నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు బొడ్డు గంగారెడ్డి, కుమ్రా కోటేష్, మాజీ ఎంపీపీలు కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, ఆడే శీల, శ్రీధర్ రెడ్డి, నరేష్, తదితరులు, పాల్గొన్నారు.

● సంక్షేమ పథకాలను చూసే కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. వడూర్ గ్రామానికి చెందిన వడూర్ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్లెం రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం వారికి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బొడ్డుగంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిడి రవి, యూత్ అధ్యక్షుడు బద్దంపోతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల శంకర్, కుంట శంకర్, గందం నవీన్, రమేష్‌రెడ్డి, కుర్మే మహేందర్, గూడురు వంశీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీఎంఎస్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

గుడిహత్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీఎంఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, ఎస్సై మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ వంటలను ప్రదర్శించారు. ఎంఈవో, ఎస్సైలు పరిశీలించి వారిని అభినందించారు. ఇందులో స్కూల్ డైరెక్టర్ మేహెరాజ్, తోషం, మన్నూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు గోపాల్ సింగ్, సంతోష్, పాఠశాల డైరెక్టర్ మేహరాజ్, స్కూల్ ప్రిన్సిపాల్ శేషారావు, సిబ్బంది, విద్యార్థులు పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

'బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి'

బోథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో మార్కెట్ ఆధ్వర్యంలో సహకార సంఘం వారు సోయా పంట కొనుగోలులో అక్రమాలు జరిగాయని, అందుకు బాధ్యులైన వారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని సహకార సంఘం డైరెక్టర్లు జి.రాజు యాదవ్, లోలపు పోశెట్టిలు అధికారులను డిమాండ్ చేశారు. ఏడాది కాలం పాటు రైతులు కష్టపడి పండించిన పంట కొనుగోలుకు క్కొరీలు పెట్టిన మార్క్‌ఫెడ్ సహకార సంఘం వారు చివరి రోజున పెద్ద మొత్తంలో దళారీ పంటనే కొనుగోలు చేశారన్నారు. మధ్య దళారీలకు వత్తాసు పలికే విధంగా వ్యవహరించిన వారిపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. జరిగిన అక్రమాలపైన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో చీకటి పాలన : మాజీ మంత్రి రామన్న

● ఆదిలాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చీకటి పాలన నడుస్తుండడం దురదృష్టకరని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పును ఖండిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం జిల్లాకేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ ప్రజల తలరాతలను మార్చాల్సిన ప్రభుత్వం విగ్రహాలను మారుస్తుండడం దురదృష్టకరమని అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లను తొలగించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కోట్లాది ప్రజల ఆకాంక్షల మేరకు స్వరాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా విగ్రహాన్ని తయారు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం సంస్కృతి ఆనవాళ్లు లేకుండా విగ్రహాన్ని రూపొందించారని, సోనియాగాంధీ పుట్టిన రోజున విగ్రహాన్ని ఆవిష్కరించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అలాల్ అజయ్, రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనుస్‌అక్బాని, మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేష్, దాసరి రమేష్, సాజిదొద్దిన్, సెవ్వజగదీశ్, స్వరూప రాణి, బట్టు సతీష్, కరుణ, ప్రమీల,పర్వీన్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

● 'తెలంగాణ తల్లి రూపం మార్చే అధికారం ఎక్కడిది?'

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి విగ్రహం రూపు మార్చే అధికారం ఎక్కడిదని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్ధన్‌రాథోడ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఇచ్చిన పిలుపు మేరకు ఉట్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ముందుగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ రాథోడ్, మాజీ ఎంపీపీ పంద్రా జయవంతరావు, మాజీ చారులత రాథోడ్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సలీముద్దీన్, మాజీ ఎంపీటీసీ జాదవ్‌మోహన్‌సింగ్, సింగారే భారత్, పెందూర్‌ప్రభాకర్, కొమ్ము విజయ్, ధరణిరాజేశ్, సత్తన్న, కాటం రమేష్, కేంద్రీ రమేష్, దావుల రమేష్, సెడ్మకి సీతారాం, సిడాం సోనేరావు, భీము, తదితరులు పాల్గొన్నారు.

● తాంసిలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

తాంసి(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాపన చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రమణ, కృష్ణ, కాంతుల్, గోవర్ధన్ రెడ్డి, రాజు, నరోత్తంరెడ్డి, నరేందర్, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మడావి భీంరావ్, షేక్ సూఫీయాన్, ఆంజద్, ధరణి ధనరాజ్, మీర్జా జీలానీ బేగ్, జాధవ్ ప్రకాష్, రాంనివాస్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

● హామీల అమలులో ప్రభుత్వం విఫలం

తలమడుగు(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచే విధంగా నూతన విగ్రహాన్ని సచివాలయంలో ప్రారంభించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విమర్శించడమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఉపాధ్యక్షులు ప్రకాష్, కేదారేశ్వర్ రెడ్డి, మొటే కిరణ్, సునీతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా సిరికొండ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న మాట్లాడారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండీ ఎక్బాల్, జాదవ్ రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

● 'కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు'

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను అవలంభిస్తుందని , ఇప్పుడు ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బోథ్ మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, బోథ్, నేరడిగొండ మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్,రాథోడ్‌సజన్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

దస్నాపూర్ గ్రామంలో వైద్య శిబిరం

ఇంద్రవెల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దస్నాపూర్ గ్రామంలో పిట్టబొంగురం పీహెచ్‌సీ డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్ వైజర్ జలంధర్, తదితరులున్నారు.

ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంజూరైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్ అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న ఆందోళనలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి మాజీ మంత్రి జోగు రామన్న, పీఆర్టీయూటీజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆడె నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్ వారికి మద్దతు తెలిపారు. ఉద్యోగులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తమను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేంత వరకు ఉద్యమిస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖద్దర్ మాఫియా!

(5వ పేజీ తరువాయి...)

వినకుంటే జిల్లా అధికారులపై సైతం వేటు వేసి తామే బదిలీ చేయించామంటూ ప్రచారం చేసుకోవడం కొంతమంది నేతలకు అలవాటుగానే మారింది. దీంతో అన్ని తెలిసినా అధికారులే అడ్డు చెప్పకుండా తేలికగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖలలో పని చేస్తున్నా.. పలువురు అధికారులను ఖద్దర్ నేతలు టార్గెట్ చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. నియోజకవర్గ స్థాయి నేతల వద్ద మంచి పలుకుబడిని సంపాదిస్తున్న కొంతమంది నేతలు పైరవీలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో మంత్రులు, ఇతర శాఖల ముఖ్య అధికారులు తమకు సన్నిహితులంటూ చెబుతు జిల్లా అధికారులను బురిడి కొట్టిస్తున్నారు. అవసరమైతే బెదిరింపులకు సైతం వెనుకాడడం లేదని తెలుస్తుంది. కొన్ని విషయాలు పోలీసు స్టేషన్ల వరకు వెళ్తున్న రాజకీయ అండతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



లబ్దిదారులకు చెక్కు, అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

దళారులను నమ్మొద్దు : పాయల శంకర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల విషయంలో దళారులను నమ్మొద్దని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 191 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల విషయంలో దళారులను నమ్మొద్దని సూచించారు.

'ఆరు గ్యారంటీల అమలులో విఫలం'

గుడిహత్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్ధాలు మోసాలతో అధికారంలోకి వచ్చిందని ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో గుడిహత్నూర్‌లో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ పూర్తి చేస్తామని ప్రకటించి ఏడాదైన అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏమి సాధించిందని విజయోత్సవాలు నిర్వహిస్తోందని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ రావు, భీంరెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర, నియోజకవర్గ కన్వీనర్ బాబారావ్, జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిహత్నూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్

నాగపూర్ పరిసరాల్లో చిరుత సంచారం

● అప్రమత్తమైన గ్రామస్థులు

భోథ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దన్నూర్, నాగపూర్ అడవి ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చిరుతపులి సంచరించినట్లు స్థానిక విశాఖ అధికారులకు గ్రామస్థుల ద్వారా సమాచారం అందింది. అయితే గ్రామస్థులు గాండ్రింపులు విన్నారు కానీ చిరుతన పులియా అనే విషయం తెలియదని పేర్కొన్నట్లు అటవీశాఖ అధికారుల ద్వారా తెలిసింది. అయితే నాగపూర్ గ్రామంలోని కుక్కలు గత రెండు రోజులుగా కనిపించకుండా పోయాయని తెలిసింది. కుక్కలు కనిపించకపోవడానికి కారణం చిరుత అయి ఉంటుందని అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. మరోవైపు అటవీశాఖ అధికారులు పాదముద్రలు సేకరించేందుకు సమాయత్తమవుతున్నారు. పాద ముద్రలు సేకరిస్తే తప్ప చిరుతపులా ? లేదా పులి అనే విషయం తేలిపోతుంది.

భయాన్ని అధిగమిస్తే విజయం

● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్



ఒత్తిడి జయించడం అనే అంశంపై మాట్లాడిన విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ శాతావాహన గ్రౌండ్‌లో మంగళవారం పీయూసీ విద్యార్థులకు ఒత్తిడి పరీక్షల భయాన్ని అదిగమించడం ఎలా అనే అంశంపై ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ తన స్వీయ జీవిత అనుభవాన్ని తెలిపారు. విద్యార్థులు రాబోయే పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు ఒత్తిడి, భయంగా భావించడం సర్వసాధారణం, ఒత్తిడి ప్రతికూల ప్రభావితం చేస్తుందని భావిస్తూ ఉంటారు. విద్యార్థులు తమకు తాముగా ఒక అధ్యాయన ప్రణాళికను రూపొందించుకోవాలి. స్టడీ మెటీరియల్‌ని నిర్వహించదగిన భాగాలుగా విడదీసి ఒక్కో అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. సానుకూల ధృక్పథంతో దెన్నైనా సాధించగలమని రిలాక్సేషన్ టెక్నిక్స్ ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఒత్తిడి, ఆందోళన, గురించి మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో మాట్లాడండి. వారు విలువైన సలహాలు మద్దతును అందిస్తారని తెలిపారు. విద్యార్థులు తమ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొవడంతో పాటు పరీక్ష భయాన్ని అధిగమించవచ్చు. పరీక్షల సమయంలో కొంత స్థాయి ఒత్తిని అనుభవించడం సాధారణం, కానీ సరైన ఆలోచన విధానం, వ్యూహాలతో ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో రణధీర్ సాగి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ విట్టల్, డాక్టర్ మహేష్, డా.చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ శ్రీధర్, డాక్టర్ రాములు, పీఆర్వో డాక్టర్ విజయ్‌కుమార్, భావుసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి'

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకర్షక ప్రగతి పాలనతో రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వానికి పెరుగుతున్న ఆధరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేపడుతున్న దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల పార్టీ నిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ వివక్షత విధానాలు, పక్షపాత ధోరణులను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు.ఇందులో లోకేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డిలతో పాటు పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు



సీఎం కప్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం



బాసర మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను కబడ్డీ ఆడి ప్రారంభిస్తున్న మండల అధికారులు

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పోటీలకు మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల నుండి 250 మంది క్రీడాకారులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా యోగాతో పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, డిస్కోత్రో, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ లాంటి ఆటల పోటలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఆయా క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సాయంత్రం మున్సిపల్లి చైర్మన్ సత్యం చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పీడీ ఇర్ఫాన్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాసర మండల కేంద్రంలో..

బాసర, డిసెంబరు, 10: (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో స్థానిక జిల్లా ప్రభుత్వ పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ 2024 మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో సీఎం కప్ కన్వీనర్ అశోక్ కుమారి, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంఈవో మైసాజీ , మండల స్పెషల్ అధికారి రమణ, ఎస్సై గణేష్, ఎంపీఓ గంగాసింగ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, గంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ పోటీలు విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచేందుకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపు, ఓటములను చూడకుండా విద్యార్థులు స్నేహపూర్వక భావంతో ఈ పోటీలలో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనా గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తురాబాద్‌లో ..

దస్తురాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో కే. రమేష్, ఎంఈవో గంగాధర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడలు శారీరక ధృడత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవ రావు, ఎంపీవో రమేష్‌రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసాలో ..

భైంసా రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోత) : మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సీఎం కప్ టోర్నమెంట్ పోటీలు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో పాల్గొని మండల స్థాయిలో విజయం సాధించిన వారికి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతఈ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం



బాసర మండలానికి వచ్చిన కొత్త 108 అంబులెన్సు వాహనం

బాసర, డిసెంబరు, 10 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండలానికి నూతన అంబులెన్స్ కేటాయించారు. మంగళవారం సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద కొత్త వాహనానికి గ్రామపెద్దలు పూజలు నిర్వహించారు. ప్రత్యేక మండలం ఏర్పాటు అయిననాటి నుంచి బాసరకు అంబులెన్సు లేక అత్యవసర పరిస్థితుల్లో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా కాలంగా అంబులెన్సు కోసం స్థానికులు కోరుతున్నారు. ఇన్ని రోజులకు కొత్త అంబులెన్స్ రాకతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

నర్సాపూర్(జి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో మంగళవారం 108 అంబులెన్స్ సేలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ... మండల ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మండల నాయకులు మంగ్లారపు మల్లేష్, జి. రవి. ఉమామహేష్, కొంద్ర రమేష్, రఘు, పైలట్ సాయి కుమార్, ఈఎంటీ ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

తానూర్ , డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోంద్రట్, తానూర్ లో మంగళవారం రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై ముధోల్ ఏరువాక శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా. కే. విజయ్‌కుమార్, డా. డి. కార్తిక్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించి, లాభాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భోల్సా వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, ఎఫ్‌పీవో సభ్యులు , రైతులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

లోకేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని మన్మథ్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్. దేవేందర్ మాట్లాడారు. విద్యార్థులందరూ తప్పకుండా చదువుకోవాలన్నారు. ఇందులో భాగంగా విద్యా ర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, సుధీర్‌కుమార్, ప్రశాంత్, విజయకుమారి, నాగభూషణం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి'

లోకేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీవో, ఎంపీవోకు మంగళవారం పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వ పాలన ఒక సంవత్సరం పూర్తయిన మమ్మల్ని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. గ్రామ పంచాయతీలలో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో మరణించినట్లయితే 50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల మదిలో మెదిలిన

రూపాన్ని మార్చడం సమర్ధనీయం కాదు



ఖానాపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ క్షీరాభిషేకం

ఖానాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మదిలో మెదిలిన తెలంగాణ విగ్రహ రూపాన్ని నీ ప్రభుత్వం మార్చడం సమర్థనీయమైన చర్య కాదని బీఆర్ఎస్ ఖానాపూర్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజ గంగన్న అన్నారు. మంగళవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, జిల్లా నాయకులు రాజారెడ్డి, పుప్పాల గజేందర్, గాంధీ, ధర్మరాజు, మధు, నసీర్, సోయాబ్, సాబీర్, మహిపాల్, పెద్ది మల్లేష్, తదితరులున్నారు.

ఉద్యమకాలపు ప్రతీకలను అవమానిస్తే సహించం

భైంసా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకాలపు ప్రతీకలను అవమానిస్తే సహించబోమని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధులు విలాస్ గాదేవార్, డా. కిరణ్ కోమ్రేవార్, లోలం శ్యామ్ సుందర్‌లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం భైంసాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్ర పటానికి పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించాయి. ఇందులో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ చరణ్, పార్టీ ప్రతినిధులు దశరథ్, రావుల పోశెట్టి, మోయిన్, దేవిదాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుభీర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్నిల అనీల్, గంగాచరణ్, మోహియోద్దిన్‌లు మాట్లాడారు.

మళ్లీ పెరిగిన చలితీవ్రత!

● భీంపూర్ మండలం అర్లి(టి)లో 11.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు



ఆదిలాబాద్‌లో జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు

ఆదిలాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో మళ్లీ చలితీవ్రత పెరిగింది. గత నాలుగైదు రోజులుగా చలిప్రభావం పెద్దగా కనిపించలేదు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చలిప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. జిల్లా సగటుగరిష్ట ఉష్ణోగ్రత 30.3 కాగా, కనిష్టంగా 12.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 11.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తలమడుగులో 11.8, మావలలో 12.0, జైనథ్‌లో 12.3, నేరడిగొండలో 12.4, ఆదిలాబాద్‌అర్బన్‌లో 13.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిరికొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో తప్ప అన్ని మండలాల్లో 15డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇన్నాళ్లు తుఫాన్ ప్రభావంతో చలిప్రభావం పెద్దగా కనిపించకపోయినా ఉష్ణోగ్రతలు ఒక్కసారి పడిపోవడంతో చలితీవ్రత భారీగా పెరిగింది. డిసెంబర్ చివరివరకు జిల్లాలో చలితీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

రహదారిని కమ్మేసిన పొగమంచు!

ఇచ్చోడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులతో గత రెండ్రోజులుగా ఉదయం దట్టమైన పొగమంచు ఏర్పడింది. పొగమంచులో రహదారిపై వాహన దారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఉదయం 8గంటలకు పొగమంచు పూర్తిగా కప్పేసింది. శీతా కాలంలో కురిసే మంచుతో ప్రకృతి కనులవిందు చేస్తోంది. సోమవారం ఉదయం మంచు దుప్పటిలో అయ్యప్ప స్వామి ఆలయం కనువిందు చేస్తోంది.



రహదారిని కమ్మేసిన పొగమంచు

ఫోకస్



ఉట్నూర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీ



డబుల్ బెడ్‌రూం ఇంట్లో పేకాట ముక్కలు

డబుల్ ఇళ్ల కేటాయింపు జరిగేనా?

● ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్న వైనం ● నేటికీ ఎంపిక కాని లబ్ధిదారులు ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఉట్నూర్, డిసెంబరు 10: గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం గృహాల నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లు నిర్మించింది. ఇళ్లు నిర్మించి ఎనిమిది ఏళ్లు కావస్తున్నా లబ్ధిదారులను గుర్తించడంలో అప్పటి పాలకులు విఫలమయ్యారు. ఫలితంగా ఆ ఇళ్లు అలాగే ఉండిపోయాయి. బడుగు బలహీనవర్గాల ప్రజలకు డబుల్‌బెడ్ రూం గృహాలు మంజూరు చేస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ హామీలిచ్చింది. అందులో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలో 80 గృహాలు నిర్మించింది. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి ఎనిమిదేళ్లు అవుతున్నా లబ్ధిదారులకు కేటాయించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేశారు. దీంతో డబుల్‌బెడ్ రూమ్ గృహాలు అలంకారప్రాయంగా మారాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన గృహాలను పేదప్రజలకు ఇవ్వకపోవడంతో రెండేళ్ల క్రితం పేదలు కొందరు గృహాలను ఆక్రమించారు. దీంతో అధికార పక్షం నాయకులు పేద ప్రజలను ఇళ్లను ఖాళీ చేయించి త్వరలోనే ఇస్తామని చెప్పిన అమలు చేయలేదు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన గృహాలు తలుపులు విరిగిపోయి, కిటికీలు పగిలిపోయి గోడలకు పగుళ్లు తేలుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు వేదిక

కోట్ల రూపాయలతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం గృహాలు లబ్ధిదారులకు కేటాయించలేక పోవడంతో ఈ గృహాల కాలనీ అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. ప్రతీరోజు పేకాట ఆడుతూ కాలక్షేపం చేస్తున్న పోకిరీలు తలుపులు కిటికీలు పగలగొడుతు ఇళ్లకు నష్టం కలిగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పేకాట అడ్డాలతోపాటు మందుబాబుల అడ్డాలుగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం గృహాలను వెంటనే కేటాయించి ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



● ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తుండడంతో విరిగిపోతున్న తలుపులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు



అలంకారప్రాయంగా ఉన్న డబుల్ బెడ్‌రూం గృహాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్



ముథోల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్



నిర్మల్‌లో మాట్లాడుతున్న ఈశ్వర్

ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

● క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం ● క్రీడల్లో గెలుపు ఓటములు సహజం : అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

దిలావర్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని న్యూలోలం ఎల్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడతూ క్రీడాస్ఫూర్తి ఆటగాళ్ల భవిష్యత్తుకు దీప్తి అవుతుందని అన్నారు. మా నసిక, శారీరక ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం చే స్తాయన్నారు. క్రీ డల్లో గెలుపు, ఓటములు సహజమేనని, అయితే మన ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. గెలిచినప్పుడు పొం గిపోకుండా, ఓడినప్పుడు కుంగిపోకుండా గెలుపు, ఓటములను స మానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. అంతకు ముందు జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి క్రీడాజ్యోతి వెలిగించారు. తెలం గాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీఏ సీఎస్ చైర్మన్ పీవీ రమ ణారెడ్డి, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఎంఈవో శంకర్, మండలంలోని 12 గ్రామపంచాయతీల కార్యదర్శులు, పేట మాజీ అధ్యక్షుడు ఎస్. శ్రీధర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, పీడీ అంబాజీ, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాలు వెలికి తీసేందుకే సీఎంకప్ పోటీలు..

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందు కు సీఎంకప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎంకప్ పో టీలను ఆయన ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ఉ న్నతచదువు, ఉద్యోగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు గుర్తింపు ల భిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. నేడు, రేపు పోటీలు కొనసాగుతాయన్నారు. కమిషనర్ ఖమర్ అహ్మద్, క్రీడల అధికారి శ్రీకాంత్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, పేట అధ్యక్షుడు భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత..

కుభీర్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తోందని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ గ్రామీణ క్రీడలను తహసీల్దార్ సోము అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రవీందర్ మాట్లాడుతూ క్రీడల్లోరాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎంతో మంది ఆణిముత్యాలు ఉన్నారని అలాంటివారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడలు దోహదపడతాయని అన్నారు. ఈక్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతోపాటు క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మరో ముగ్గురు పీఈటీలు నిర్వహిస్తున్నారు. మూడురోజులపాటు క్రీడాకారులకు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు చంద చేసి భోజనాల వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్ సింగ్, ఎం ఈవో విజయ్‌కుమార్, కుభీర్, పల్సి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జే. సాయినాథ్, డిసురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలు

ముథోల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం సీఎంకప్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ముథోల్ తహసీల్దార్ శ్రీకాంత్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యాన్ని, క్రీడాసంస్కృతిని పెంచుతుందన్నారు. క్రీడలతోపాటు చదువులో కూడా రాణించాలన్నారు. మంచి ప్రతిభ కనబరిచి మండలానికి పేరు తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా క్రీడలు ప్రారంభించారు. మండలంలోని సుమారు 13 గ్రామ పంచాయతీల నుంచి 300 వరకు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈక్రీడలు రెండురోజులు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచినవారు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. కార్యక్రమంలో ముథోల్ సీఐ మల్లేష్, ఎంపీడీవో శివ కుమార్, ఎంఈవో రమణారెడ్డి, గ్రామపంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్, పీడీ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కుంటాల, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కుంటా లలో గత రెండురోజులుగా నిర్వహించిన గ్రామస్థాయి, మండలస్థా యి సీఎంకప్ పోటీల్లో జిల్లాస్థాయికి పలువురు విద్యార్థులు ఎంపిక య్యారు. కుంటాలస్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో నిర్వహించిన ఈపోటీలలో సీఎంకప్ పోటీలను ప్రత్యేక అధికారి లింబాద్రి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, ఎంపీవో రహీం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



కుభీర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో



క్రీడాపతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా క్రీడా అధికారి శ్రీకాంత్‌రెడ్డి



కుంటాలలో టాస్ ఎగరేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలి: పీవో

ఉట్నూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు గిరిజన సహకార సంస్థ ద్వారా తాజా కూరగాయలు, నాణ్యమైన వంటసరుకులు సరఫరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ఆశ్రమ పాఠశాలలకు సరఫరా అవుతున్న సరుకులపై సమీక్షించారు. కూరగాయలు, సరుకుల ఆశ్రమ పాఠశాలలను 2వారాలకు ఒక్కసారి సందర్శించి నాణ్యత పరిశీలించాలని జీసీసీ సిబ్బందిని ఆదేశించారు. ఏ పాఠశాలకు ఎంతెంత సరుకులు సరఫరా చేస్తున్నారు వాటి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫోన్ సమాచారం ద్వారా సరుకులను సరఫరా చేయరాదని సొసైటీ మేనేజర్‌లకు ఆదేశించారు. చెడిపోయిన కూరగాయలను గాని నాణ్యత లేని సరుకులను గాని సరఫరా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఖద్దర్ మాఫియా!





- భూ వివాదాల్లో తలదూర్చుతున్న కొందరు నేతలు
- విలువైన సీసీఐ భూములపై బడాబాబుల కన్ను
- రాజకీయ అండతో యథేచ్ఛగా అక్రమ దందాలు
- మాటవినని అధికారులకు బెదిరింపులు
- అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలదంతా ఒకే తీరు

ఆదిలాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ముసుగులో కొంత మంది ఖద్దర్ నేతలు అడ్డగోలు దందాలకు పాల్పడడం అలవాటుగానే మారిందంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంతకైనా తెగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పలువురు నేతల చుట్టూ భూ వివాద ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా కొందరు నేతల తీరు కనిపిస్తోంది. దీంతో వివాదస్పద విలువైన భూముల్లో తలదూర్చుతు సెటిల్‌మెంట్లు చేయడం పరిపాటిగానే మారింది. దీనికి తోడు రెవెన్యూ చట్టాలపై తమకు ఉన్న పరిజ్ఞానంతో లొసుగులను అనుకూలంగా మల్చుకుంటూ రూ.కోట్ల విలువైన భూములను సులువుగా కొట్టేసే ప్లాన్ చేస్తున్నారు. బినామీ వ్యక్తుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయిస్తూ.. అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాకేంద్రం చుట్టు ఉన్న విలువైన ప్రభుత్వ భూములపై బడా నేతల కన్నుపడి కనిపించకుండా పోతున్నాయి. తాజాగా కోట్ల రూపాయల విలువ చేసే సీసీఐ భూములకు కొంత మంది నేతలు టెండర్ పెట్టారనే ఫిర్యాదులు వస్తున్నాయి. తరచు వివాదాల్లో చిక్కుకుంటున్న నేతలే అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ముఖ్య నేతలుగా చెలామణవుతూ.. పెత్తనం చెలాయిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

తెరవెనుక ప్రయత్నాలు

మూతబడిన సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలంటూ ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు వస్తున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. దీంతో విలువైన సీసీఐ భూముల్లో వెంచర్లను వేసేందుకు కొంతమంది నేతలతో పాటు జిల్లాకేంద్రానికి చెందిన ఒకరిద్దరు బడాబాబులు పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే సీసీఐ భూముల వేలానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. బడాబాబులను ముందు ఉంచి నేతలు తెరవెనుకుండి ఈ తతంగాన్ని నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. సీసీఐ భూముల టెండర్‌తో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుందని చూపుతూ కోట్ల రూపాయలను కొట్టేసేందుకు ప్లాన్ వేశారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వ స్థాయిలో చక్రం తిప్పి విలువైన భూములను చౌకగా కొట్టేసేందుకు కుట్ర చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పరిశ్రమ పునరుద్ధరణపై కనిపించని ఆసక్తి భూముల టెండర్‌పై కనిపిస్తోం దన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సీసీఐ భూములు ఆక్రమణలకు గురై కనిపించకుండానే పోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే పునరుద్ధరణ సాధ్యపడదంటూ పలుమార్లు ప్రభుత్వ పెద్దలే తేల్చిచెప్పడం తో జిల్లావాసులు ఆశలు వదులుకుంటున్నారు. దీనిని అనుకూలంగా చేసుకుంటున్న కొంతమంది నేతలు సీసీఐ భూములపై కన్నేసినట్లు ప్రచారం సాగుతుంది.

రాజకీయ అండదండలు

అక్రమ దందాలకు అలవాటుపడిన కొంత మంది నేతలు పార్టీ ఏదైనా అధికార పార్టీలోనే కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ దందాలకు ఎవరూ అడ్డురావొద్దన్న ఉద్దేశంతో కండువాలు మార్చేస్తున్నారు. వీరికి పార్టీ ముఖ్య నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. కేవలం దందాలను కాపాడుకునేందుకే కొందరు రాజకీయాల్లో కొనసాగుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా జిల్లాకేంద్రంతో పాటు చుట్టుపక్కల భూ వివాదాలతో సంబంధాలు ఉండడం జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న ఇసుక రవాణా పలు రకాల టెండర్‌లపై కన్నేస్తున్న నేతలు రాజకీయాల్లో ముఖ్య నేతలుగా చెలామణి అవుతున్నారు. ఇప్పటికే మావల, బట్టిసావర్గాం, ఆదిలాబాద్ రూరల్ మండల పరిసర ప్రాంతాల్లో ఉన్న రూ.కోట్ల విలువ చేసే భూములను గుప్పిట్లో పెట్టుకున్నట్లు తెలుస్తుంది. కొన్ని సంఘటనలు మాత్రమే బయట పడుతున్నా.. మరి ఎన్నో వివాదాలు బయటకు పొక్కకుండా సెటిల్ చేస్తున్నారు. కొన్ని పోలీసు స్టేషన్ల వరకు వెళ్తున్నా.. గోప్యంగా ఉంచుతూ జాగ్రత్త పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తూ.. భూ ఆక్రమణలకు పాల్పడుతున్న అడ్డుచెప్పే అధికారులే సైలెంటై పోతున్నారు. తమకున్న తెలివి తేటలతో కోర్టు స్టేలు తీసుకొచ్చి మరీ వివాదస్పద భూములను కబ్జా చేస్తున్నారు.

మాటవినకుంటే అంతే సంగతి



తమ అక్రమ దందాలకు అడ్డు వస్తున్న అధికారులపై వేటు వేసేందుకు వెనుకాడడం లేదు. చెప్పింది వింటే సరి.. లేదంటే బదిలీ వేటు వేస్తామని బెదిరింపులకు దిగడం పరిపాటిగానే మారింది. పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని మండలాల్లో పలువురు అధికారులపై బదిలీ వేటు వేసిన దాఖలాలు ఉన్నాయి. మాట

(మిగతా 6లో...)



మాట్లాడుతున్న నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు

నేడు నాగోబా ఆలయ వార్షికోత్సవ నిర్వహణపై సమావేశం

ఇంద్రవెల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మూడో వార్షికోత్సవం నిర్వహణపై బుధవారం కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద సమావేశం కానున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో నిర్వహించే నాగోబా ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలపై ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ లోని మెస్రం వంశీయులు తరలిరావాలని కోరారు. ఇందులో మెస్రం వంశీయులు, మెస్రం లక్ష్మణ్, మెస్రం నాగోరావు, మెస్రం ఆనంద్‌రావు, గ్రామస్థులు, మడావి నగేష్, తొడసం సాగర్, తదితరులు ఉన్నారు.

నాగోబాను దర్శించుకున్న సబ్ కలెక్టర్ యువరాజ్



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా దేవతను మంగళవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాగోబా జాతర ఏర్పాట్లపై మెస్రం వంశీయుల పెద్దలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ రావు, మెస్రం ఆనందరావు, తోడసం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

ఉట్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ మిషన్‌ను సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ప్రారంభించారు. మంగళవారం స్థానిక అజయ్‌పవార్ ఫౌండేషన్ ద్వారా అందించిన వాటర్ ఫిల్టర్ ద్వారా పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం మెరుగుగ్గా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అజయ్ పవార్ ఫౌండేషన్ చైర్మన్ పవార్ అజయ్ తమ సొంత డబ్బులు రూ.40 వేలు వెచ్చించి పాఠశాలలో ప్యూరీఫైడ్ మిషన్ ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అజయ్ పవార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జాదవ్ రమేష్, విశ్రాంత ఈఈ రాథోడ్ బీమ్‌రావ్, డాక్టర్ సాడిగే రాజగోపాల్, ఉపాధ్యాయులు పవార్‌కృష్ణ, కుంర శ్రీనివాస్, జాదవ్ రాజేశ్, ఉపేందర్, జ్యోతబాదు, రవీందర్, నిరూప్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

గుడిహత్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల రోగులకు మానవ హక్కుల సంఘం సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ హక్కుల గురించి తెలుసుకుని వాటిని పాటించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాథోడ్ రోహిదాస్, సుద్దాల రాజు, రాథోడ్ ఆనంద్ రావు, మాల్యాల శ్రీకర్, అంకుష్, సంజీవ్, జంగు, తదితరులు పాల్గొన్నారు.

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డులు
- 4లక్షల 47వేల 135 మంది గ్రామీణ ఓటర్లు
- ముగిసిన రాజకీయ పార్టీల సమావేశం





- సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా)

ఆదిలాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ నేతలతో ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో 473 గ్రామ పంచాయతీల పరిధిలో 3870 వార్డులకు గాను పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పురుషులు 2లక్షల 18వేల 683 మంది ఓటర్లు కాగా మహిళలు 2లక్షల 28వేల 436 మంది ఓటర్లు అలాగే మరో 16 మంది ఇతరులు మొత్తం 4లక్షల 47వేల 135 ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొదటి దశలో ఆదిలాబాద్ (34), మావల (3), బేల (37), జైనథ్ (42), తాంసి(14), భీంపూర్ (26) మొత్తం 156 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తారు. అలాగే రెండవ దశలో బోథ్‌లో (33), బజార్‌హత్నూర్(31), నేరడిగొండ, (32), గుడిహత్నూర్(26), తలమడుగు (29) మొత్తం 151 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికలు ఉంటాయి. మూడవ దశలో ఇంద్రవెల్లి మండలంలో (28), ఉట్నూర్‌లో (38), నార్నూర్‌లో (23), గాదిగూడ(25), సిరికొండ (19), ఇచ్చోడ(33) మొత్తం 166 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మొత్తం 3888 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12న అన్ని మండలాల కేంద్రాలలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 13న పరిష్కారం చూపుతారు. ప్రభుత్వ ఆదేశాలతో రిజర్వేషన్లు ఖరారు కాగానే ఎన్నికల ఏర్పాట్లను మరింతగా వేగవంతం చేయనున్నారు. తుది ఓటరు జాబితాను డిసెంబర్ 17న వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, జడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, డీపీఓ శ్రీలత, డీఎల్‌పీఓ ఫణింద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

గిరిజన బాలికలు లక్ష్యంతో చదవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

ఉట్నూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికలు లక్ష్యంతో చదివినప్పుడు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. మంగళవారం ఉట్నూర్ పట్టణంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను అకస్మీకంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలు, భోజన, వసతి తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని అన్నారు. బాగా చదివి తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని ఆమె అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం రుచి చూశారు. అలాగే పాఠశాల పరిసరాలు, వంటగది, సరుకులు, స్నానపు గదులు, తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీవేణి, ఉపాధ్యాయులు రాజన్న, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ముక్రా(కె)కు హమారా సమ్మాన్ అవార్డు

ఇచ్చోడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో బెస్ట్ టాయిలెట్‌లను ఎంపిక చేసి ముక్రా(కె) గ్రామానికి అవార్డులను అందజేసింది. మండలంలోని ముక్రా(కె) గ్రామానికి హమారా సౌచ్చాలయ్.. హమారా సమ్మాన్ అవార్డును డీఆర్‌డీఏ పీడీ సాయన్న చేతుల మీదుగా ఈ అవార్డును గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్‌లు, తదితరులు అందుకున్నారు.

తాంసిలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

తాంసి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం తాంసి గ్రామానికి చెందిన కాటిక సాయి, రామన్నలు నిర్వహించిన 18 మెట్ల పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతికి, తర్వాత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి 9 రకాల పదార్థాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం 18 మెట్లు వెలిగించి అయ్యప్ప స్వామికి మంగళ హారతిని ఇచ్చి కార్యక్రమాన్ని ముగించారు. తాంసి గ్రామానికి చెందిన కళాకారులు రాజన్న, గంగారెడ్డి, కిషన్, రమేష్ రెడ్డిలు పాడిన భక్తి పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సతీష్ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తాంసి స్వాములే కాకుండా చుట్టుపక్కల స్వాములు సైతం హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు వచ్చిన స్వాములకు తాంబూలాన్ని సమర్పించుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థినులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం మండలకేంద్రంలో ఖుష్టు వ్యాధి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో వడూర్ గ్రామానికి చెందిన టీబీ పేషేంట్‌కు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంల్లో హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, వార్డెన్ స్వప్న, ఏఎన్ఎంలు సంగీత, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

- మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ

బోథ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజిద్ అలీ, ఎంపీడీవో రమేష్ కోరారు. మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు అంతేకాక విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ సంగీతకు సూచించారు. నాసిరకం కల్తీ పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కాగా కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత బాగుందన్నారు. అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలలో పాల్గొన్న ఆటగాళ్లకు, విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ రామారావు, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎస్సై ప్రవీణ్, ఎంఈవో పోశెట్టితో పాటు ఉపాధ్యాయులు శ్రీని వాస్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

సీఎం కప్ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

- ఇందిరా ప్రియదర్శిని మైదానంలో మండల స్థాయి పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్యామలాదేవి
- జిల్లావ్యాప్తంగా మండల టీంల ఎంపిక
- కొనసాగుతున్న క్రీడాపోటీలు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో మండలస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభించారు. విద్యార్థులను పరిచయం చేసుకున్న అనంతరం వారితో కలిసి సరదాగా కబడ్డీ ఆడుతూ ఉత్సాహపరిచారు. పోటీలను ప్రారంభిచి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి'

తలమడుగు(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ అన్నారు. మంగళవారం మండలంలోని బరంపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థుల క్రీడల నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం కప్పు పేరుతో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి, మండల ప్రత్యేక అధికారి గజానన్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్, మండల విద్యాధికారి వెంకట్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, ముడుపు దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు మండల టీంలు ఎంపిక

బజార్‌హత్నూర్(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని 30 గ్రామ పంచాయతీలలోని క్రీడాకారులకు జాతర్ల గ్రామంలోని మినీ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి పోటీలను మంగళవారం నిర్వహించారు. క్రీడాకారుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు, ఎంపీవో మహేందర్ రెడ్డి, పీటీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



బరంపూర్‌లో ప్రారంభిస్తున్న శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ

మండల స్థాయి పోటీల కోసం స్థల పరిశీలన

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ 2024 పోటీల కోసం మండల కేంద్రంలో స్థలాన్ని మంగళవారం అధికారులతో కలిసి నార్నూర్ ఎంపీడీవో జవవార్ స్థల పరిశీలన చేశారు. గురువారం సీఎం కప్ మండల స్థాయి పోటీ ఉన్నందున క్రీడాకారులు అధికారులు, ప్రజలు గమనించగలరని పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి మూతి రామ్, సిబ్బంది ఉన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడానికే పోటీలు

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఆర్డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు.

గుడిహత్నూర్(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ కవితారెడ్డి, ఎస్సై మహేందర్, ఎంఈఓ రాథోడ్ ఉదయ్ రావ్, ఎంపీడీవో అబ్దుల్ హైలు ప్రారంభించారు.

భీంపూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలను మండల స్పెషల్ ఆఫీసర్ డీపీఏహెచ్‌వో డాక్టర్ కిషన్, తహసీల్దార్ నలంద ప్రియ, ఎంఈవో శ్యామ్ సుందర్‌లతో కలిసి ప్రారంభించారు.